ప్రధాన రహదారులకు మహర్దశ

- రూ.75 కోట్లతో అభివృద్ధికి చర్యలు
- నరసాపురం నియోజకవర్గంలోని గ్రామాలకు కొత్త కళ


నిర్మాణంలో ఉన్న కాళీపట్నం - పాతపాడు రహదారి


చురుగ్గా సాగుతున్న మొగల్తూరు కొప్పర్రు రోడ్డు పనులు

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు గతంలో తీరప్రాంత గ్రామాల్లోని పుంత రోడ్లను జాతీయ విపత్తు నివారణ పథకం నిధులతో అభివృద్ధి చేశారు. అంతేకాక నియోజకవర్గంలోని గ్రామాలపై పూర్తి అవగాహన ఉండటంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ముందున్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ప్రసాదరాజు ప్రధాన రహదారులపై దృష్టి సారించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నారు.

95 కిలోమీటర్ల మేర రూ.75 కోట్లతో అభివృద్ధి

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 95 కిలో మీటర్ల రహదారులను రూ.75 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే కొన్ని రహదారుల పనులు ప్రారంభం కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ప్రత్యేక నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన లిఖితపూడి-మల్లవరం, పెదలంక రోడ్డు పనులు, రూ1.50 కోట్లతో చేపట్టిన సీతారాంపురం-కొప్పర్రు, రూ.2 కోట్లతో చేపట్టిన చిట్టవరం, కాజ రోడ్డు మరమ్మతు పనులు, రూ.1.70 కోట్లతో చేపట్టిన పసలదీవి-రామన్నపాలెం, లక్ష్మణేశ్వరం నుంచి పీఎం లంక రూ.20 కోట్లు, నరసాపురం టౌన్ నుంచి కరింశెట్టివారి మెరక వయా లక్ష్మణేశ్వరం, సారవ రూ.7 కోట్లు, బియ్యపుతిప్ప మోళ్ళపర్రు వయా వేములదీవి, పీఎం లంక రూ.4.30 కోట్లు, నరసాపురం పీతానివారి మెరక వయా లక్ష్మణేశ్వరం, వైఎస్ పాలెం, రామన్నపాలెం రూ.2.70 కోట్లతో చేపట్టిన రహదారి పనులు పూర్తయ్యాయి. ముత్యాలపల్లి, మోళ్ళపర్రు వయా మోడి, పేరుపాలెం రూ.28 కోట్ల చేపట్టిన పనులు, కొత్తోట, కోమటితిప్ప, దెయ్యాలతిప్ప, జిల్లేడుతిప్ప, నీటితిప్ప వయా వెంప, కాళీపట్నం, రూ.9 కోట్లతో చేపట్టిన పనులు ఇటీవల ప్రారంభం కాగా, మెట్రేవు, అల్లంవారిమెరక నుంచి పేరుపాలెం బీచ్ వరకు రూ.8 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనున్నారు. అంతేకాక కాళపట్నం పడమర నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకు రహదారి నిర్మాణంతో పాటు రెండు వరుసల వంతెన నిర్మాణం కోసం మంజూరైన రూ.12కోట్లతో చేపట్టిన పనుల్లో వంతెన పూర్తికాగా సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బేతపూడి వరకు వయా వెంప రహదారికి మంజూరైన రూ.12.64 కోట్లతో చేపట్టిన పనుల్లో ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.

మరిన్ని రహదారుల అభివృద్ధి



ఇప్పటికే కోట్లాది రూపాయలతో రహదారులు, వంతెనలు నిర్మించాం. ఇటీవల విడుదలైన రూ.75 కోట్లతో సుమారు 90 కిలోమీటర్ల మేర రహదారి పనులను చేపట్టబోతున్నాం. నియోజకవర్గంలోని మరికొన్ని రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్ విప్

వేగంగా పూర్తి చేస్తాం



నియోజకవర్గంలో చేపట్టిన రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దాదాపు 10 రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం.

– జీవీఎస్ కిరణ్‌కుమార్, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

ప్రధాన సమస్య తీరింది



మా గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి కాగా, రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలపై అవగాహన ఉండటంతో నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన పూర్తియ్యేలా చర్యలు తీసుకోవడంతో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

– దొంగా నాగముని, కాళీపట్నం

నేడు కొత్తపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మొగల్తూరు: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రంలో శిబిరాన్ని నిర్వహిస్తామని, మొగల్తూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులతో పాటు మరో ముగ్గురు స్పెషలిస్టు డాక్టర్లు రోగులను పరీక్షిస్తారని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

నరసాపురం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నరసాపురం: నరసాపురం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని స్థానిక అప్పన ప్లాజాలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.శ్రీనివాస్, పి.సత్యనారాయణ, కోశాధికారిగా నవీన్ గుప్తా ఎన్నికయ్యారు. మొత్తం 16 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీ ఏర్పడింది. ఈ ఏడాది క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నూతన కార్యవర్గం తెలిపింది.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' ముగింపు కార్యక్రమం

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక వైఎన్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విజేతలకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు బహుమతులు అందజేయనున్నారు.

క్లుప్తంగా

పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు

మొగల్తూరు: మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక బాపన్న, ప్రసాద్ ఆధ్వర్యాన స్వామి, అమ్మవార్లకు పూజలు, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పేరుపాలెం చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళీకా సమేత కాళికేశ్వర స్వామి ఆలయంలో, ముత్యాలపల్లి భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయాల్లోనూ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


సరిపల్లిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విద్యార్థి దశ నుంచే వృత్తినైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలని సరిపల్లి సర్పంచ్ ఈదా సురేష్‌బాబు, ఎంపీటీసీ చిన్నం వెంకట్రావు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 18 మంది 8వ తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గమిడి మధుబాబు, మైలాబత్తుల కృష్ణంరాజు, కేదాసు శోభనరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రమీలారాణి

పెనుగొండ: స్థానిక ఎస్వీకేపీ అండ్ పి వెంకన్న జూనియర్ కళాశాలలో సోమవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రమీలారాణి మాట్లాడుతూ పశు సంపదను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవడం ద్వారా పశువులను రక్షించుకోవచ్చునన్నారు. పండ్ల చెట్లు పెంపకంతో పక్షుల సంతతిని పెంచుకోవచ్చునన్నారు. పక్షోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

పెనుగొండ: పెనుగొండ శివారు మల్లప్పదిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయంలో సోమవారం ఉదయం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. అమ్మవారికి రూ.2,49,002లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో డి.పుష్పభాను తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు బీవీఎస్ ప్రసాద్, మన్నే శ్రీనివాస్, టి.సాయిబాబు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 4 నెలలకు గానూ అమ్మవారికి ఈ ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భీమవరం: భీమవరం టౌన్ హాలులో పేకాడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి టౌన్ హాలులో పేకాడుతున్నట్లు సమాచారం అందటంతో దాడిచేయగా 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11,320 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం

ఉండి: పాందువ్వలో మంగళవారం ఉందయం 9 గంటలకు నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఆకివీడు పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా

ఆకివీడు: కౌలు పొలం వివాదం నేపథ్యంలో మండలంలోని చినకాపవరంలో పెద్దిరెడ్డి జాన్‌పీటర్ (24) అనే యువకుడు మృతి సంఘటనపై సోమవారం మృతుడి బంధువులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట, జాతీయ రహదారిపై ధర్నా చేశారు. సీఐ సత్యనారాయణ, ముగ్గురు ఎస్సైలు బాధితులతో చర్చలు జరిపి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీ.నాగబాబు చెప్పారు. మృతుడు తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామన్నారు. సుమారు ఐదు గంటల పాటు ధర్నా చేయడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మహిళలకు అగ్రస్థానం ఘనత సీఎం జగన్‌దే


మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రస్థానం కల్పించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నామినేటెడ్ పదవుల్లోనూ మహిళలకు సగభాగంగా చిత్తశుద్ధితో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అదేవిధంగా ప్రతి సంక్షేమ పథకం లబ్ధి మహిళల ఖాతాల్లోకే చేరేలా జమ చేశారన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందంజ వేయాలని కోరారు. కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ఏపీ ఉమెన్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, సర్పంచ్ మట్టా కుమారి, ఎంపీటీసీ పెచ్చెట్టి లలిత, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ రిజ్వాన పాల్గొన్నారు.

పరామర్శలు

ఆచంట మండలంలో సోమవారం పలు కుటుంబాలను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు పరామర్శించారు. ఆచంటలో వైఎస్సార్ సీపీ నాయకుడు నెక్కంటి సతీష్ మాతృమూర్తి కృష్ణవేణి, వంగడాల చెరువుకు చెందిన గుబ్బల దొరబాబు మాతృమూర్తి అనంత లక్ష్మి ఇటీవల మృతిచెందారు. ఆయా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఏఎంసీకి నూతన పాలకవర్గం

చైర్మన్‌గా సాలా దేవి, వైస్ చైర్మన్‌గా డీటీడీసీ బాబు


ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చైర్మన్‌గా సాలా దేవి, వైస్ చైర్మన్‌గా పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), డైరెక్టర్లుగా కలిగితి సుగుణ సుందర కుమారి, కల్యాణం గంగాధరరావు, వడ్లపాటి సుజన కుమారి, కుసుమే ఝాన్సీ మేరీ హేమలత, మేళం శేష వేణి, సప్పరపు శంకర పార్వతి, దొమ్మేటి ఏడుకొండలు, మహ్మద్ జరీనా బేగం, మందా హరికుమార్, దొంగా నాగలక్ష్మి, నడపన వెంకట సుబ్బారావు, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ, జమ్ము ముత్యంజయరావు, గుర్రాల వెంకట్రావులను నియమిస్తూ జీవో విడుదల చేశారు. ఈ మేరకు ఏఎంసీ కార్యాలయంలో సోమవారం రాత్రి నూతన కమిటీ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, మాజీ వైస్ చైర్మన్ పొత్తూరి బుచ్చిరాజు, మండల కన్వీనర్లు ఎం.మైఖేల్‌రాజు, పితాని చిన్నా, చాంబర్ ప్రతినిధులు దేవరపు లక్ష్మీనారాయణ, గుణ్ణం సర్వారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలుసుకుని అభినందించారు.

పేదలకు వైద్యం జగనన్న బాధ్యత


మేడపాడులో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న వెంకట్రావు

యలమంచిలి: రాష్ట్రంలో ప్రతి పేదవాడి మెరుగైన వైద్యం బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్నారని మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను సోమవారం ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు పెద్ద జబ్బులు వస్తే మరణమే శరణ్యం అనేలా పరిస్థితి ఉండేదన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చి పేదలకు ఉచితంగా రూ.5 లక్షల వరకు కార్పొరేట్ వైద్య సౌకర్యం కల్పించారన్నారు. ఆయన వారసుడిగా ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచిత వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచడమే కాక, పథకం వర్తించే వ్యాధుల సంఖ్యను కూడా పెంచారన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికలలో ప్రజలంతా బాసటగా నిలవాలని వెంకట్రావు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ నాయకులు గంధం సత్యకీర్తి, డేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు డిజిటల్ అసిస్టెంట్ ఆలీషా, ఏఎస్ఎం యర్రంకి మహాలక్ష్మీ నర్సమ్మ, ఆశా కార్యకర్తలు మత్తే శాంతకుమారి, కవురు వెంకట నర్సమ్మ, సాకా ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

21 ఉత్తమ కవితా రచనలు ఎంపిక

భీమవరం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సర్వోదయ మండలి జిల్లా వ్యాప్తంగా గాంధేయం అనే అంశంపై నిర్వహించిన కవితా రచనల పోటీల్లో 21 మంది ఉత్తమ రచనలకు ఎంపికయ్యారని మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు సోమవారం తెలిపారు. విజేతలకు ఈనెల 30వ తేదీన పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనంలో కవితా పురస్కారాలు, బహుమతులు అందజేస్తామని, అలాగే గాంధేయం పుస్తకావిష్కరణ ఉంటుందని ప్రసాదరాజు తెలిపారు.

శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గాంధీ మండలాల వద్ద శాంతి ప్రదర్శనలు, సర్వమత ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ప్రసాదరాజు తెలిపారు.

కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలి

- వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి
- పాలకొల్లులో బూత్ కన్వీనర్ల సమావేశం



మాట్లాడుతున్న గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన పట్టణ బూత్, వార్డు ఇన్‌చార్జ్‌ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ కన్వీనర్లు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాలను దగ్గర పెట్టుకుని ఆయా వార్డుల్లో స్థానికంగా లేని, ఒకే ఓటు రెండుసార్లు తప్పుగా ముద్రించినవి, మరణించిన వారి ఓట్లు ముందుగానే జాబితాల్లో గుర్తించి వాటిని సున్నా చుట్టుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు అనేక కుట్రలు చేస్తాయని, వాటిని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, సచివాలయాల జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాస్, కావలి శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, నంబూరు శ్రీగంగా పవన్, బండి రమేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, రావి నాగేశ్వరరావు, చినిమిల్లి గణపతిరావు, వీరా శ్రీనివాసరావు, ఉచ్చుల స్టాలిన్, కొర్రగింజల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా వేళా కనపడని పితాని

సుంకర సీతారామ్ విమర్శ


సుంకర సీతారామ్, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు

పెనుగొండ: నియోజకవర్గంలోని ప్రజలు కరోనా కాలంలో విలవిల్లాడిపోతే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఎక్కడా కనిపించలేదని, ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో పాదయాత్ర పేరుతో మభ్యపెట్టడానికి యత్నాలు చేస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ విమర్శించారు. సోమవారం కొడమంచిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరోనాలో ఎక్కడికి వెళ్లిపోయారంటూ నియోజకవర్గ ప్రజలందరూ ప్రశ్నిస్తున్నారన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ 'ఆసరా.. మనసారా' కార్యక్రమంలో 10 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తుండటంతో పితాని తట్టుకోలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పాదయాత్రలో ఇంటింటికీ తిరుగుతూ లేనిపోని దుష్ప్రచారం చేయడానికి యత్నిస్తూ అబాసు పాలవుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాజమండ్రి జైలు నుంచి బయటకు రావడానికి నలుగురు ష్యూరిటీ పెడితే గాని రాలేదని, మరి ప్రజల భవిష్యత్‌కు గ్యారంటీ ఎక్కడ ఇస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలు నాలుగేళ్ల తరువాత మాజీ మంత్రి పితానికి గుర్తువచ్చారన్నారు. రా.. కదలిరాకు నియోజకవర్గ ప్రజలు తరలి రాకపోవడంతో పాదయాత్ర ప్రారంభించారన్నారు. పాదయాత్రకు స్పందన రాకపోవడంతో అసహనం పెరిగిపోయి కుతంత్రాలు పన్నుతూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు, అవాస్తవాలు ప్రచారం చేసినా ప్రజలకు తెలుసునని, మరోసారి ఓటమిని చవిచూడటం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో పితానికి ఎదురు దెబ్బ తగలడం ఖాయమన్నారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాహనాలను నడిపే డ్రైవర్లు కంటి చూపును పరిరక్షించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా లయన్స్ క్లబ్ సహకారంతో డ్రైవర్లకు సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ఫిబ్రవరి 3న రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ రోడ్ షో, 8న నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో కంటి వైద్య శిబిరం, 17న పాలకొల్లు సెయింట్ మేరీ స్కూల్‌లో క్విజ్ పోటీలు, 19న పాలకొల్లులో రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. శిబిరంలో 199 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 46 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించి ఉచితంగా అందజేయడానికి ఎంవీఐ వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. అలాగే 10 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి.రామస్వామి, రమేష్, లయన్స్‌క్లబ్ అధ్య, కార్యదర్శులు ముచ్చర్ల సత్యనారాయణ, మాఘం నారాయణరావు, కోశాధికారి గోనెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం


గోపాలం కుటుంబాన్ని పరామర్శిస్తున్న సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు

పోడూరు: జిన్నూరు శివారు నరసింహారావు పేటలో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కట్టా గోపాలం (62) కుటుంబ సభ్యులను సోమవారం సొసైటీ చైర్మన్ చైర్మన్ డీటీడీసీ బాబు పరామర్శించారు. జిన్నూరు అన్నపూర్ణమ్మ గుడి వద్ద పాలకొల్లు – మార్టేరు రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గోపాలం తీవ్రంగా గాయపడ్డారు. తీవ్రగాయాలతో ఉన్న ఆయనను స్థానికులు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గోపాలంకు భార్య లీలావతి, వివాహితులైన ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గోపాలం మృతి బాధాకరమని, కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకునేలా కృషి చేస్తామని సొసైటీ చైర్మన్ బాబు ధైర్యం చెప్పారు. పరామర్శించి వారిలో గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయ రావు(బుజ్జి), వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు, కార్యదర్శి మీసాల దాన వెంకట నరసింహులు, జిత్తుగ శ్రీను, పితాని సత్యప్రసాద్, జక్కంశెట్టి రాము, కదలి శివన్నారాయణ, పంపన చాణిక్య శెట్టి తదితరులు ఉన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన

భీమవరం: భీమవరం టుటౌన్ రైల్వేస్టేషన్‌లో సోమవారం రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్సై పీటీవీ రమణ మాట్లాడుతూ రైలులో ప్రయాణించే సమయంలో రైలు ఎక్కే., దిగే సమయాల్లో అత్యంత జాగ్రతగా ఉండాలన్నారు. రైలు కదులుతుండగా ఎక్కడం, దిగడం ప్రమాదకరమని చెప్పారు. అలాగే ప్రయాణికులు తమ విలువైన వస్తువులను అత్యంత జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని ప్రయాణికులకు సూచించారు. కార్యక్రమంలో రైల్వే కానిస్టేబుల్ బి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

భీమవరం: పట్టణంలోని మారుతీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక సెంట్రల్ పార్క్ గ్రంథాలయం వద్ద కామన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వలవల నర్సింహరావు, పంపన శ్రీనివాసరావు, కోశాధికారిగా పావిరాల రామమోహన్‌రావు, ఉపాధ్యక్షునిగా చేకూరి వెంకట నర్సింహరాజు, జాయింట్ సెక్రటరీగా కొవ్విలి శ్రీనివాసరావు తదితరులతో ఎన్నికల అధికారి కొత్తపల్లి సూర్యనారాయణరాజు ప్రమాణ స్వీకారం చేయించారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

కాళ్ల: అన్నదాన భవన నిర్మాణానికి కాళ్ళకూరు ఆందాశ్ గోష్టి సభ్యులు విరాళం అందజేయడం అభినందనీయమని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ అన్నారు. కాళ్ళకూరు గ్రామంలో వేంచేసి యున్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నందు గ్రామానికి చెందిన భూపతిరాజు సుబ్బరాజు, నాగమ్మ జ్ఞాపకార్థం కుమారుడు భూపతిరాజు నర్సింహరాజు రూ:5,000, పొత్తూరి వెంకటరాజు రూ:25,000, భీమవరానికి చెందిన గోమగుంట్ల వెంకట నాగ రామ సుకాంత్ రూ.12,006 అన్నదాన భవన నిర్మాణానికి విరాళంగా అందజేశారు.